ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
సోమవారం 8 జూలై 2024

తిరువణ్ణామలైలో ఆణి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెరంబూర్, జూలై 7: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ ఆణి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున అన్నామలైయార్ సమేత ఉన్నామలై అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరుడు, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి బంగారు ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. భక్తుల శివనామస్మరణ, మేళతాళాల మధ్య శివాచార్యులు ఉదయం 6 గంటలకు ధ్వజ పతాకాన్ని ఆవిష్కరించారు. 10 రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో మాడవీధుల్లో విహరించనున్నారు. 10వ రోజు అయ్యన్‌కుళంలో తీర్థవారి కార్యక్రమం జరుగనుంది. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు.


ఉన్నామలై అమ్మవారి సమేత అరుణాచలేశ్వర స్వామి


ధ్వజస్తంభంపై పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శివాచార్యులు

ఎన్డీఏ ప్రభుత్వంలో కొత్త చట్టాలకు తావులేదు

● కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం



ప్యారీస్, జూలై 7: లోక్‌సభలో బలమైన ప్రతిపక్షం ఉన్నందువల్ల ఎన్డీఏ ప్రభుత్వం ఇక నుంచి సులువుగా కొత్త చట్టాలను ప్రవేశపెట్టే అవకాశం ఉండదని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం పేర్కొన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో శివగంగ నియోజకవర్గం నుంచి ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరం గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ విజయానికి కారకులైన ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు, మైనార్టీలకు కృతజ్ఞతలు తెలిపేందుకు శనివారం సాయంత్రం చిదంబరం తిరుపత్తూర్ ప్రాంతానికి వెళ్లారు. ఆయనకు పెద్ద మసీదు జమాత్, క్రిస్టియన్ సోషల్ వింగ్ తరఫున ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ... పౌరహక్కు సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడే అవకాశముందన్నారు. గత 17వ లోక్‌సభలో అత్యధిక మెజార్టీతో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం నియంకుశ పోకడతో వ్యవహరించి ఇష్టమొచ్చినట్లు చట్టాలను నెరవేర్చగలిగిందని, ప్రస్తుతం ఇండియా కూటమి బలమైన ప్రతిపక్షంగా ఉన్నందున ఇకపై మోదీ ప్రభుత్వం కొత్త చట్టాలను ప్రవేశపెట్టే అవకాశమే లేదన్నారు. ముఖ్యంగా, ఉమ్మడి పౌరసత్వ చట్టం, ఒకే దేశం-ఒకే ఎన్నికలు వంటి చట్టాలను ఇండియా కూటమి ఎట్టి పరిస్థితిల్లోను అనుమతించబోదని ఆయన తెలిపారు.

నేటితో ప్రచారం పరిసమాప్తం

● విక్రవాండి ఉప ఎన్నికలో ఎవరిదో విజయం ?


విక్రవాండిలో ఆదివారం సాయంత్రం డీఎంకే అభ్యర్థి శివాకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచార ఘట్టం సోమవారం సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ప్రచారం సమయం ముగిసిన తర్వాత ఆ నియోజకవర్గంలో ఉంటున్న స్థానికేతరులందరూ వారి స్వస్థలాలకు తిరిగి వెళ్ళాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహూ ఉత్తర్వు జారీ చేశారు. విక్రవాండి డీఎంకే ఎమ్మెల్యే పుగళేంది అనారోగ్య కారణాల వల్ల గత ఏప్రిల్‌లో మృతి చెందడంతో ఆ నియోజకవర్గంలో ఈ నెల 10న ఉప ఎన్నిక జరుగనుంది. డీఎంకే తరఫున అన్నియూరు శివా, ఎన్డీయే తరఫున పీఎంకే అభ్యర్థిగా సి. అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి తరఫున డాక్టర్ అభినయ సహా మొత్తం 29 మంది పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే,దాని మిత్రపక్షమైన డీఎండీకే పోటీ నుండి తప్పుకున్నాయి. డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివాకు మద్దతుగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత కాదర్‌మొయిుద్దీన్, సీపీఎం నేత బాలకృష్ణన్, సీపీఐ నేత ముత్తరసన్ ప్రచారం చేశా రు. రెండు రోజులకు ముందు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విక్రవాండి నియోజకవర్గ ఓటర్ల నుద్దేశించి ప్రసంగించారు. ఇక నామ్‌తమిళర్ కట్చి అభ్యర్థి అభినయ తరఫున ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ ఇంటింటా ప్రచారం చేశారు.

పీఎంకే ప్రచారం...

పీఎంకే అభ్యర్థి సి.అన్బుమణికి మద్దతుగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, ఆయన సతీమణి సౌమ్య ప్రచారం చేశారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ప్రచారంలో పాల్గొన్నారు. పోలింగ్‌కు మూడు రోజులే మిగిలి ఉండటంతో మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఆ పార్టీల స్థానిక నాయకులు ఆదివారం తీవ్రస్థాయిలో ప్రచారం చేశారు. ఆదివారం సాయంత్రం మంత్రి ఉదయనిధి ఈ నియోజకవర్గంలో ప్రచారం చేశారు. సోమవారం సాయంత్రం వరకూ ఆయన నియోజకవర్గమంతా రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తిరువామాత్తూరులో ఆయన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాత్రి విల్లుపురంలో బస చేశారు. సోమవారం ఉదయం నుంచి మళ్ళీ ప్రచారం చేస్తారు. ఇక పీఎంకే అభ్యర్థి అన్బుమణికి మద్దతుగా అమ్మామక్కల్ మునేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ ఆదివారం సాయంత్రం తేమూరు విక్రవాండి ప్రాంతం వద్ద ప్రచారం చేశారు. సినీ నటుడు శరత్‌కుమార్ కూడా పీఎంకేకు మద్దతుగా ప్రచారం చేశారు.

ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళులర్పించేందుకు వచ్చిన పార్టీ శ్రేణులు


ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయం


బౌద్ధమతాచారం ప్రకారం ఆర్మ్‌స్ట్రాంగ్ అంత్యక్రియలు

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర నాయకుడు ఆర్మ్‌స్ట్రాంగ్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు బౌద్ధమతాచారం ప్రకారం జరిగాయి. హైకోర్టు ఆదేశం మేరకు రెడ్‌హిల్స్ సమీపం పోత్తూరులో ఆయన భౌతికకాయాన్ని ఖననం చేసేందుకు పార్టీ శ్రేణులు పూలతో అలంకరించిన శకటంలో తీసుకువెళ్లారు. పెరంబూరు నుంచి 21 కి.మీ.ల దూరంలో ఉన్న ఆ ప్రాంతానికి ఆర్మ్‌స్ట్రాంగ్ అంతిమయాత్ర సాగింది. సుమారు మూడు వందల మంది పోలీసుల బందోబస్తు, పార్టీశ్రేణుల, ప్రముఖులు, ఆప్తుల నడుమ యాత్ర సాగింది. పొత్తూరులో ఆయన అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ఖననం చేసే ప్రదేశం ఎంపికపై ఉత్కంఠ

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయాన్ని ఖననం చేసే ప్రాంతం ఎంపికపై రోజంతా ఉత్కంఠ నెలకొంది. డీఎండీకే నేత విజయకాంత్ భౌతికకాయాన్ని కోయంబేడులోని ఆ పార్టీ కార్యాలయం వద్ద ఖననం చేసేందుకు అనుమతించినట్లే తన భర్త భౌతిక కాయాన్ని పెరంబూరులోని పార్టీ కార్యాలయం వద్ద ఖననం చేసేందుకు అనుమతించేలా ప్రభుత్వానికి (కార్పొరేషన్‌కు) ఆదేశాలివ్వాలని కోరుతూ ఆర్మ్‌స్ట్రాంగ్ సతీమణి ఎ.పొర్కొడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర కేసులను విచారణ జరిపే న్యాయమూర్తి ఈ పిటిషన్‌పై ఆదివారం ఉదయం విచారణ ప్రారంభించారు. పెరంబూరులోని బీఎస్పీ కార్యాలయం వద్ద ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతిక కాయాన్ని ఖననం చేసేందుకు అనుమతించలేమని ప్రభుత్వ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయాన్ని ఖననం చేసేందుకు మూడు ప్రాంతాలను జీసీసీ అధికారులు ప్రతిపాదిస్తున్నారని, వాటిలో ఏదైనా ఒక స్థలంలో ఖననం చేసుకోవచ్చునని, ఆర్మ్‌స్ట్రాంగ్ పేరిట స్మారక మండపాన్ని పార్టీ కార్యాలయం వద్ద నిర్మించేందుకు కూడా ఎలాంటి అభ్యంతరాలుండవని తెలిపారు. ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబీకుల అభిప్రాయాల మేరకు ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయాన్ని రెడ్‌హిల్స్ సమీపం పొత్తూరులో ఖననం చేయాలని న్యాయమూర్తి వి. భవానీ సుబ్బరాయన్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో రాజకీయ నేతలకే భద్రత లేదు

డీపీఐ ఎంపీ తిరుమావళవన్

ప్యారీస్, జూలై 7: రాష్ట్రంలో రాజకీయ నేతలకు భద్రత లేదని డీపీఐ పార్లమెంటు సభ్యుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. స్థానిక పెరంబూర్ బందర్ గార్డెన్ కార్పొరేషన్ గ్రౌండ్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి ఆదివారం తిరుమావళవన్ అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆమ్‌స్ట్రాంగ్ హత్య ఖండించదగ్గదని, 17 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాలను పాటిస్తూ రాజకీయాల్లో రాణిస్తున్న ఆమ్‌స్ట్రాంగ్‌ను హత్యచేసిన అసలైన నిందితులను పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

దళిత నేతలకు భద్రత కల్పించండి : సెల్వపెరుంతగై

దళిత నాయకులకు తగిన భద్రత కల్పించాలంటూ తమిళనాడు కాంగ్రెస్ కమిటీ(టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. ఆమ్‌స్ట్రాంగ్ భౌతిక కాయానికి అంజలి ఘటించిన అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ... విద్యావంతులైన యువకులను ఆమ్‌స్ట్రాంగ్ న్యాయవాదులుగా మార్చారని, సామాజిక భద్రతకు ఆయన ఎనలేని కృషిచేశారని తెలిపారు.

అరెస్టయినవారే అసలైన నిందితులు...

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో పోలీసులు అసలైన నిందితులనే అరెస్ట్ చేశారని ఉత్తర చెన్నై జోనల్ పోలీస్ అడిషనల్ కమిషనర్ అస్రా కార్గ్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో హంతకులు తప్పించుకోకుండా అరెస్ట్ చేసేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. హత్య జరిగిన నాలుగు గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేసి మూడు ద్విచక్రవాహనాలు, ఏడు వేట కొడవళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు నిందితులను శనివారం సాయంత్రం అరెస్ట్ చేశామని, ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను వేగవంతం చేయడంతో నిందితులు లొంగిపోయినట్లు తెలిపారు. పేరుమోసిన రౌడీ ఆర్కాడు సురేష్ హత్యకు కక్ష సాధింపు చర్యగానే ఆమ్‌స్ట్రాంగ్‌ను హతమార్చారని, దీనికి రాజకీయాలతో సంబంధాలు లేవన్నారు. పట్టుబడిన 11 మందిలో అసలైన నిందితులు లేరని వాదించేవారు ఆధారాలు సమర్పిస్తే పరిశీలించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు అస్రా కార్గ్ తెలిపారు.



ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న మాయావతి

ఆర్మ్‌స్ట్రాంగ్ కేసు సీబీఐకి అప్పగించాలి

● తమిళనాట శాంతిభద్రతల కరవు ● బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గౌతమబుద్ధుడి సిద్ధాంతాలను అనుసరిస్తూ తమిళనాట పార్టీని విస్తరింపజేసేందుకు తీవ్రంగా పాటుపడిన ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యవార్త విని తాను దిగ్భ్రాంతి చెందానని బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పెరంబూరులో ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తనకు అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉంటూ అంకితభావంతో పార్టీకి సేవలందించిన ఆర్మ్‌స్ట్రాంగ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, తమ పార్టీ నేత హత్యకు కారణమైన నిజమైన దోషులు ఇంకా అరెస్టు కాలేదని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు ఉద్రేకం చెందకుండా సహనం పాటించాలని పిలుపునిచ్చారు. ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించాలని కూడా ఆమె డిమాండ్ చేశారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబీకులకు ఓదార్పు...

ఇదిలా ఉండగా బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదివారం ఉదయం పెరంబూరు కార్పొరేషన్ స్కూలు ప్రాంగణంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి దారుణహత్యకు గురైన ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబీకులను పరామర్శించేందుకుగాను మాయావతి ఉత్తర ప్రదేశ్ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం మీనంబాక్కం విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి కారులో పెరంబూరు చేరుకుని ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, సినీ దర్శకుడు పా రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూముల స్వాధీనం కేసు...

మాజీ మంత్రి నివాసం సహా 10 చోట్ల సీబీసీఐడీ తనిఖీలు


కరూరు వడివేల్‌నగర్‌లోని విజయభాస్కర్ నివాసం

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో రూ.100 కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసులో గత 25 రోజులుగా పరారీలో ఉన్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ నివాసాలు సహా 10 చోట్ల సీబీసీఐడీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ ,ఆయన తమ్ముడు శేఖర్ మరికొందరు కలిసి తనకు చెందిన రూ.100 కోట్ల విలువైన 22 ఎకరాల భూములను నకిలీ పత్రాలు సృష్టించి అపహరించినట్లు గత నెల 25న కరూరు నగర పోలీసులకు వాంగల్ కుప్పుచ్చిపాళయంకు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు తనను అరెస్టు చేస్తారనే భయంతో ముందస్తు బెయిలు కోరుతూ మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్, ఆయన తమ్ముడు శేఖర్ తదితరులు కరూరు జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ విచారణ పెండింగ్‌లో ఉండగానే భూముల అపహరణ కేసు విచారణ బాధ్యతలను ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించింది. దీంతో కరూరు జిల్లా సీబీసీఐడీ పోలీసులు ఎనిమిది ప్రత్యేక బృందాలుగా విజయభాస్కర్, ఆయన తమ్ముడు శేఖర్ తదితరుల నిందితుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కరూరు, మదురై, తిరుచ్చి, దిండుగల్, నామక్కల్, సేలం జిల్లాలకు చెందిన సీబీసీఐడీ అధికారులు విజయభాస్కర్ అనుచరులకు చెందిన నివాసాల్లో తనిఖీలు జరిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న యువరాజ్, రఘు, సెల్వరాజ్, మారప్పన్ నివాసాల్లో సోదాలు జరిపారు. ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి విజయభాస్కర్, ఆయన తమ్ముడు తదితరులు దాఖలు చేసిన బెయిలు పిటిషన్లను మేజిస్ట్రేట్ తోసిపుచ్చారు. ఆ క్రమంలో కరూరులోని విజయభాస్కర్, ఆయన సోదరుడి నివాసాలు, కార్యాలయాల్లో సీబీసీఐడీ పోలీసులు సోదాలు నిర్వహించారు. చెన్నై, కరూరు సహా పది చోట్ల ఆదివారం ఒకే సమయంలో సీబీసీఐడీ తనిఖీలు చేసింది. చెన్నై అభిరామపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న సుందరం రోడ్డులో పలు అంతస్థుల భవనంలోని విజయభాస్కర్‌కు చెందిన ప్లాటులో సీబీసీఐడీ సీఐ రమ్యా నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఇదే విధంగా కరూరు - కోయంబత్తూరు రోడ్డు ఎస్ఎస్ఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఉన్న విజయభాస్కర్‌కు చెందిన ప్లాట్, అక్కడికి చేరువగా ఉన్న నాలు గోదాము, రెయిన్‌బో నగర్‌లో ఉన్న అద్దకాల కర్మాగార కార్యాలయం, రెయిన్‌బో అపార్ట్‌మెంట్‌లో ఉన్న విజయభాస్కర్ తమ్ముడి నివాసంలోనూ సీబీసీఐడీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇదే విధంగా కోయంబత్తూరు రోడ్డులోని పెట్రోల్ బంక్, తిరువిక రోడ్డులోని ఎంఆర్‌వి ట్రస్టు కార్యాలయం, రామానుజం నగర్‌లోని పలు అంతస్థుల భవనంలోనూ సీబీసీఐడీ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఇలా ఒకే సమయంలో పదిచోట్ల మాజీ మంత్రి విజయభాస్కర్, ఆయన తమ్ముడి నివాసాలు, అనుచరుల కార్యాలయాలు, నివాసాలు అంటూ మొత్తం పది చోట్ల ఈ తనిఖీలు జరిగాయి.

రాష్ట్రంలో పెరిగిన హత్యలు, దోపిడీలు!

● ఈపీఎస్ ఆరోపణ ● మదురైలో కరపత్రాల పంపిణీ


మదురై ఎయిర్‌పోర్ట్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, హత్యలు, దోపిడీలు అధికమయ్యాయని, రాజకీయ నాయకుల ప్రాణాలకు కూడా భద్రతలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. రామనాథపురం జిల్లా పరమకుడి సమీపం తెలిసంధై నల్లూరు గ్రామంలో వందడుగుల ఎత్తు పార్టీ పతాకావిష్కరణ, పార్టీ స్థానిక నాయకుడి ఇంటి పెళ్ళి వేడుకల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం ఈపీఎస్ చెన్నై నుంచి మదురై వెళ్ళారు. మదురై విమానాశ్రయం వద్ద మాజీ మంత్రులు సెల్లూరు రాజా, ఆర్బీ ఉదయకుమార్, ఎమ్మెల్యే రాజన్ చెల్లప్పా తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత రాష్ట్రంలో గత మూడేళ్లుగా శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయంటూ పార్టీ స్థానిక నాయకులు డీఎంకే పాలనలో శాంతి భద్రతల కరవు అనే పేరిట ముద్రించిన కరపత్రాలను విమానాశ్రయం వద్దే ఈపీఎస్ ప్రజలకు పంచిపెట్టారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఇటీవల జరిగిన బీఎస్పీ నేత హత్య రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏమేరకు క్షీణించాయో స్పష్టమవుతుందని ఆరోపించారు.

పంచాయతీ అధ్యక్షురాలి దాతృత్వం

విద్యార్థుల కోసం బస్సు కొనుగోలు

పెరంబూర్, జూలై 7: తిరుప్పూర్ జిల్లా పడియూర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థులు తమ ఇంటి నుంచే పాఠశాలకు వెళ్లేలా పంచాయతి అధ్యక్షురాలు, తన సొంత ఖర్చుతో బస్సు సదుపాయం కల్పించారు. పడియూర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో సుమారు 900 మంది, సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. పడియూర్ పరిసర గ్రామాల నుంచి ప్రతిరోజు విద్యార్థులను తల్లిదండ్రులు సైకిళ్లు, ద్విచక్రవాహనాల్లో తీసుకొస్తుంటారు. పాఠశాల అనంతరం సాయంత్రం వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతునానరు. ఈ పాఠశాల మార్గంలో ఒకే ఒక్క బస్సు నడుస్తుండగా, నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. దీంతో, విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. విద్యార్థుల ఇబ్బందులు గుర్తించిన పడియూర్ పంచాయతి అధ్యక్షురాలు జీవిత షణ్ముగసుందరం, తన సొంత ఖర్చుతో రూ.16 లక్షలతో బస్సు కొనుగోలు చేశారు. బస్సు డ్రైవర్, సహాయకుడికి కూడా తానే వేతనం ఇస్తానని ఆమె ప్రకటించారు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ... ఈ బస్సు ద్వారా విద్యార్థులు ఎలాంటి శ్రమ లేకుండా పాఠశాలకు వెళ్లవచ్చన్నారు.


బస్సులో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

అలాగే, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులు కూడా ఎలాంటి భయాందోళన లేకుండా ఇళ్లకు చేరుకోవచ్చని తెలిపారు. బస్సుకు జీపీఎస్, కెమెరా, వేగ నియంత్రణ పరికరం ఏర్పాటుచేసినట్లు జీవిత తెలిపారు.

మెట్టూరు డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో


పరవళ్లు తొక్కుతున్న హొగెనేకల్ ప్రధాన జలపాతం

పెరంబూర్, జూలై 7: సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక స్వల్పంగా పెరిగింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల్లో ప్రవాహం పెరిగింది. దీంతో అదనపు నీటిని కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పిల్లగుండు మీదుగా హొగెనేకల్‌కు 3,000 ఘనపుటడుగులుగా వస్తోంది. హొగెనేకల్ ప్రధాన జలపాతం, ఐందురువి, సినీ ఫాల్స్ తదితర జలపాతాల్లో నీటి ఉధ్రుతి పెరిగింది. హొగెనేకల్ నుంచి మేట్టూరు డ్యాంకు శనివారం 1,465 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, ఆదివారం ఉదయం 2,832 ఘనపుటడుగులకు పెరిగింది. దీంతో మేట్టూరు డ్యాం నీటిమట్టం 39.76 అడుగుల నుంచి 40.05 అడుగులకు పెరిగింది. తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రానికి 32 కోట్ల మంది పర్యాటకుల రాక

● పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్



పెరంబూర్, జూలై 7: ఈ ఏడాది రాష్ట్రానికి 32 కోట్ల మంది పర్యాటకులు వచ్చారని పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్ తెలిపారు. నీలగిరి జిల్లా ఊటీ బోట్ హౌస్‌ను శనివారం పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సమయమూర్తితో కలసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... నీలగిరికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోందన్నారు. పర్యాటకులు ఊటీ బోట్ హౌస్, బొటానికల్ పార్క్, తొట్టపెట్ట తదితర పర్యాటక ప్రాంతాలకు మాత్రమే వెళుతున్నారని తెలిపారు. అందువల్ల జిల్లాలోని కున్నూర్, కోతగిరి, మైనాలా ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే పనులు చేపట్టామన్నారు. 2022-23 వ సంవత్సరంలో రాష్ట్రానికి 28 కోట్ల మంది పర్యాటకులు రాగా, 2024లో పర్యాటకుల సంఖ్య 32 కోట్లకు పెరిగిందన్నారు. పర్యాటకుల రాకపోకలు పెంచేలా మెడికల్ టూరిజంతో పాటు ఇతర రకాల టూరిజంను ప్రాచుర్యంలోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి రూ.40 కోట్ల కేటాయించామన్నారు. అలాగే, పర్యాటక అభివృద్ధికి రూ.160 కోట్లు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్‌కు నివాళి



వేలూరు, జూలై 7: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌కు గుడియాత్తం సెరు బ్యాంక్ వద్ద అంజలి ఘటించే కార్యక్రమం జరిగింది. కోటీశ్వరన్ అధ్యక్షత వహించగా, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దళిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆమ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపి, సురేష్, సెహ్రా, మనవాలన్, గణేశన్, న్యాయవాదులు పన్నీర్‌సెల్వం, శంకర్ వడివేలు, భాస్కర్, ధనంజయన్, వెంకటేశన్, మణికంఠన్, దాస్, జయమధు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

వేలూరు, జూలై 7: స్థానిక కోట రౌండ్ ఠానా సమీపంలో ఉన్న పోలీసు మండపంలో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మణివన్నన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చే వినతిపత్రాలకు రసీదులు ఇవ్వాలని, సమస్యలు విచారించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


జిల్లా గ్రంథాలయ ఆధునికీకరణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 7: కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదివారం పరిశీలించారు. తందై పెరియార్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రూ.2.50 కోట్లతో ఆధునికీకరణ పరిశీలించిన కలెక్టర్, ఈనెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 17వ వార్డులో ఉన్న పాత బెంగళూరు జాతీయ రహదారిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, నిక్లసన్ కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే, తోటపాళ్యంలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడ సంక్షేమ హాస్టల్ పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. కలెక్టర్ వెంట మేయర్ సుజాత, కమిషనర్ జానకి రవిచంద్రన్, కౌన్సిలర్ కాంచన, తాగునీటి శాఖ ఇంజనీర్ నిత్యానందం, జాతీయ రహదారుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కుమరేశన్, జిల్లా గ్రంథాలయ అధికారి పళని, పీడబ్ల్యూడీ అసిస్టెంట్ ఇంజనీర్ పడవేట్టన్, కార్పొరేషన్ నిర్వాహక ఇంజనీర్ పార్వతి తదితరులున్నారు.

తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడి

నేటినుంచి జాలర్ల ఆందోళన

ప్యారీస్, జూలై 7: బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడడంతో జాలర్లు తీరానికి తిరిగొచ్చారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి శనివారం ఉదయం 400లకు పైగా మరబోట్లల్లో రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేసిన టోకెన్లు పొందిన జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వీరిలో 10 పడవలతో వెళ్లిన జాలర్లు అర్ధరాత్రి నడి సముద్రంలో చేపలు పడుతుండగా మూడు నిఘా పడవల్లో వచ్చిన శ్రీలంక కోస్ట్‌గార్డ్ సిబ్బంది రామేశ్వరం జాలర్లపై దాడి చేసి అక్కడి నుంచి తరిమికొట్టారు. దీంతో 10కి పైగా మరబోటుల్లో వెళ్లిన జాలర్లు తీరానికి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో, శ్రీలంక కోస్ట్‌గార్డ్ దాడులను ఖండించేలా సోమవారం నుంచి సమ్మె, రాస్తారోకో, నిరాహారదీక్ష తదితర వరుస ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రామనాథపురం జిల్లా జాలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సహాయం ప్రకటించారు.

ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలు... పుదువై, చెన్నైలో ప్రశాంతంగా పోలింగ్

ప్యారీస్, జూలై7: ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన రెండో విడత పోలింగ్ ఆదివారం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ప్రశాంతంగా ముగిసింది. ఆసియా దేశాల నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ పుదుచ్చేరి, కారైక్కాల్, చెన్నైలో ప్రారంభమైంది. ఫ్రాన్స్ పార్లమెంటుకు తొలి రౌండ్ ఎన్నికలు గతనెల 30న ప్రశాంతంగా జరిగాయి. ఈ రౌండ్‌లో రెండు కూటములకు 33.4 శాతం, 27.9 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మానువేల్ మైగ్రాన్ నేతృత్వంలోని కూటమి 20.7 శాతం ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ దౌత్య కార్యాలయంలో ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఆదివారం ప్రారంభమైన రెండో రౌండ్ పోలింగ్‌లో ఫ్రాన్స్ పౌరసత్వం ఉన్న 4,550మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పుదుచ్చేరి ఎన్డీయేలో చీలికలు!

అసమ్మతి వర్గాలతో నేడు రాజీ యత్నం

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ఎన్డీయేలో గత కొద్ది వారాలుగా కొనసాగుతున్న అధికారపక్షం, బీజేపీకి మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధాన్ని నివారించే దిశగా బీజేపీ అధిష్ఠానం చర్యలు ప్రారంభించింది. ఆ మేరకు పుదుచ్చేరి పార్టీ వ్యవహారాల నిర్వాహకుడిగా నియమితులైన కర్ణాటకకు చెందిన నిర్మల్‌కుమార్ సోమవారం రానున్నారు. ముఖ్యమంత్రి రంగస్వామిపై విమర్శలు చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలతో, ఆ పార్టీ మద్దతు ఇండిపెండెంట్ సభ్యులతోనూ ఆయన చర్చలు జరుపబోతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కైవశం చేసుకోవడంతో ఎన్డీయేలోని ఎన్‌ఆర్ కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు, నేతల మధ్య అభిప్రాయబేధాలు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఓటమికి మీరంటే మీరే కారణమంటూ రెండు పార్టీల నేతలు పరస్పరం విమర్శలకు దిగారు. ముఖ్యమంత్రి రంగసామి, మంత్రులకు వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు, ఇండిపెండెంట్లు తిరుగుబాటు బావుటా వేస్తున్నారు. మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు అసమ్మతివర్గంగా ఏర్పడ్డారు. బీజేపీ మద్దతు ఇండిపెండెంట్ అంకాళన్ ముఖ్యమంత్రి రంగసామిపై ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడుగురు శాసనసభ్యులు ఢిల్లీ వెళ్ళి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తదితరులను కలుసుకుని ముఖ్యమంత్రి రంగసామిపై ఫిర్యాదు చేశారు. ఇకపై రంగసామి ప్రభుత్వానికి బయటనుంచి మద్దతు ఇచ్చేలా సరికొత్త నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర నేత సెల్వగణపతి పనితీరును మాజీ అధ్యక్షుడు సామినాథన్ ఖండిస్తూ అదేపనిగా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయానికి బాధ్యత వహించి సెల్వగణపతి పార్టీ పదవికి రాజీనామా చేయాలని పట్టుబడుతున్నారు. ఇలా పుదుచ్చేరిలోని ఎన్డీయేలో పార్టీ నడుమ అంతర్యుద్ధం తీవ్రరూపం దాల్చటంతో అన్ని పార్టీల మధ్య రాజీ కుదర్చడానికి బీజేపీ అధిష్ఠానం చర్యలు ప్రారంభించింది. ఆ మేరకు పుదుచ్చేరి పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన నిర్మల్‌కుమార్‌ను నియమించింది. దీంతో రాజీ కుదిర్చే నిమిత్తం నిర్మల్‌కుమార్ సోమవారం పుదుచ్చేరి రానున్నారు. ఉదయం పది గంటలకు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను కలుసుకుని చర్చలు జరుపనున్నారు. అన్ని వర్గాలూ సమష్టిగా పనిచేసి, రంగసామి ప్రభుత్వం సాఫీగా కొనసాగేలా రాజీ చర్చలు జరుపనున్నారు.

మాంజోలై ఎస్టేట్ కార్మికులను కాపాడండి

● పుదియతమిళగం నేత కృష్ణసామి డిమాండ్


డాక్టర్ కృష్ణసామి

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా మాంజోలై తేయాకు ఎస్టేట్ ప్రాంతంలో తరాలుగా పనిచేస్తున్న కార్మికులకు అక్కడే ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పుదియతమిళగం నేత డాక్టర్ కృష్ణసామి డిమాండ్ చేశారు. తిరునల్వేలిలో ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాంజోలై వద్ద తేయాకు తోటలను నిర్వహిస్తున్న ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ లీజు గడువు 2028లో ముగియనుందని, ఆ లీజు గడవు ముగిస్తే ఆ తేయాకు తోటలన్నీ ప్రభుత్వ పరమవుతాయని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉండగా లీజుగడువు ముగియటానికి ముందుగానే ఆ సంస్థ కార్మికులను నిర్బంధ పదవీ విరమణ చేయిస్తోందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితులలోను కార్మికులను మాంజోలై నుండి గెంటివేయకూడదని, ఈ విషయంగా తాను హైకోర్టులో పిటిషన్ వేశానని, తానే విచారణకై హాజరై బలమైన వాదనలు వినిపించి తేయాకు తోటల కార్మికుల సంక్షేమానికి సాయపడతానని కృష్ణసామి అన్నారు.

నిషేధిత ఆఫ్రికా కెళుత్తి చేపలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చేపలు

ఐసిఎఫ్, జూలై 7: నామక్కల్‌లో విక్రయానికి ఉంచిన 36 కిలోల నిషేధిత ఆఫ్రికన్ కెళుత్తి చేపలను మత్స్యశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధర్మపురి, సేలం జిల్లాల నుంచి తీసుకొచ్చిన చేపలను నామక్కల్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి చేపలు స్వాధీనం చేసుకొని, వాటిని గుంత తవ్వి పూడ్చివేశారు. అనారోగ్యానికి హాని కలిగించే ఆఫ్రిక కెళుత్తి చేపల విక్రయిస్తే కఠినచర్యలు చేపడతామని చేపల వ్యాపారులను అధికారులు హెచ్చరించారు.

పాము విషం విక్రయాల ద్వారా రూ.2.50 కోట్ల ఆదాయం


పాము నుంచి విషం తీస్తున్న కార్మికుడు

పెరంబూర్, జూలై 7: చెంగల్పట్టు జిల్లా వడనెమ్మేలిలోని ఇరుళర్ పాములు పట్టే వృత్తుల సహకార సంఘం, మూడేళ్లలో 1,807 గ్రాముల పాము విషయం విక్రయాల ద్వారా రూ.2.50 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఈ ప్రాంతంలో ఉన్న పాముల నుంచి తీసే విషాన్ని పూనే సహా పలు నగరాల్లో మందులు తయారీ సంస్థలకు విక్రయిస్తున్నారు. ఏడాదికి సరాసరిన 500 గ్రాముల విషం తీసి, రూ.1.50 కోట్లకు విక్రయిస్తున్నట్లు ఆ సంఘం తెలియజేసింది.

సమాచార దర్శిని

23 నుంచి పాఠశాల స్థాయి వాలీబాల్ పోటీలు

పెరంబూర్, జూలై 7: చెన్నై వాలీబాల్ సంఘం, షాన్ అకాడమి గ్రూప్ ఆఫ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో చెన్నై జిల్లాస్థాయి పాఠశాలల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఎగ్మూర్ రాధాకృష్ణన్ మైదానంలో ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన బాలబాలికల జట్లు పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన పాఠశాలలు chennaidistrictvollyballassn@gmail.com అనే ఈ-మెయిల్ ద్వారా ఈనెల 19వ తేదిలోపు పేర్లు నమోదుచేసుకోవచ్చు. వివరాలకు 9444842628, 9841816778 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 7: చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ఆదిద్రావిడుల మహోన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న డిగ్రీ టీచర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. మీనంబాక్కం, మధురవాయల్, తిరుమంగళం పాఠశాలల్లో తలా ఒక పోస్టు, విరుగంబాక్కం పాఠశాలలో మూడు, వలసరవాక్కం పాఠశాలలో రెండు పోస్టులు మొత్తం 8 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ పోస్టులకు పాఠశాల మేనేజిమెంట్ కమిటీ ద్వారా ప్రోత్సాహక వేతనంగా నెలకు రూ.15,000 అందజేస్తారు. అర్హులైన, ఆసక్తి ఉన్న వారు కలెక్టర్ కార్యాలయంలోని ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని ఈ నెల 10వ తేదిలోపు సంప్రదించాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

5 వరకు ఊటీ ప్రత్యేక రైలు

పెరంబూర్, జూలై 7: ఊటీ ప్రత్యేక కొండ రైలు ఆగస్టు 5 వరకు పొడిగించారు. నీలగిరి జిల్లా ఊటీ, కున్నూర్, మేట్టుపాళయం మధ్య నడుపుతున్న పారంపర్య కొండ రైలులో ప్రయాణం చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఊటీ-కున్నూర్ మధ్య ప్రతిరోజు 4 సార్లు, మేట్టుపాళయం-ఊటీ మధ్య ఒక సారి కొండరైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 29వ తేది నుంచి వారంలో శుక్రవారం నుంచి సోమవారం వరకు ఊటీ-మేట్టుపాళయం, ఊటీ-గెత్తి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. ఈ నెల 1వ తేదీతో ఈ ప్రత్యేక రైలు సేవలు ముగియగా, పర్యాటకుల విజ్ఞప్తి మేరకు ఆగస్టు 5వ తేది వరకు ఈ ప్రత్యేక రైలు సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

పోలీసునంటూ మోసం

● యువకుడి అరెస్ట్

పెరంబూర్, జూలై 7: స్థానిక మెరీనా బీచ్‌లో పోలీసునని చెప్పి నగదు వసూలుచేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొట్టివాక్కం వేంబులి అమ్మన్ ఆలయ వీధికి చెందిన కుమరవేల్ బైక్ టాక్సీ నడుపుతున్నాడు. సంఘటన జరిగిన రోజున, మెరీనా బీచ్ సమీపంలో లైట్ హౌస్ వెనుక భాగంలో నిద్రపోతున్నాడు. ఆ సమయంలో అటువైపు వచ్చిన వ్యక్తి, తాను పోలీసునని బెదిరించి కుమరవేల్ నుంచి సెల్‌ఫోన్, రూ.8,500 నగదు, డెబిట్, క్రెడిట్ కార్డులు తీసుకొని వెళ్లిపోయాడు. ఈ విషయమై కుమరవేల్ మెరీనా క్రైం విభాగం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా కుమరవేల్ వద్ద పోలీసునంటూ నగదు దోపిడీ చేసిన వ్యక్తి తిరుపత్తూర్ జిల్లా తిరుమాల్‌నగర్‌కు చెందిన విఘ్నేష్ గా గుర్తించారు. అతడిపై తిరుపత్తూర్, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి సహా 8 జిల్లాల్లో పలు కేసులు నమోదయ్యాయని విచారణలో తెలిసింది. దీంతో, విఘ్నేష్‌ను అరెస్ట్ చేసి పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

పీఎంకేకు ఆఖరి ఎన్నికలు

● కాంగ్రెస్ నేత ఈవీకేఎస్

ఐసిఎఫ్, జూలై 7: విక్రవాండి ఉప ఎన్నిక పీఎంకేకు ఆఖరి ఎన్నికలని కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ తెలిపారు. సేలంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... విక్రవాండిలో నామ్ తమిళర్ పార్టీ వారు హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి విజయం సాధించడం తథ్యమన్నారు. హత్యలు, దోపిడీలు దీర్ఘకాలంగా జరుగుతున్నాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరడం సమంజసం కాదని ఈవీకేఎస్ హితవు పలికారు.

మూడు ప్రాంతాల్లో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఐసిఎఫ్, జూలై 7: రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో ఆదివారం 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మదురై విమానాశ్రయంలో 39.4 డిగ్రీలు, మదురైలో 38.8, నాగపట్టణంలో 38.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే సమయంలో గాలిలో తేమశాతం తక్కువగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. చెన్నైలో ఆదివారం సాయంత్రం టి.నగర్, కోడంబాక్కం, వడపళని, ఆవడి, తిరునింద్రవూర్, పట్టాభిరాం సహా పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

12 వరకు కొనసాగనున్న వర్షాలు

పెరంబూర్, జూలై 7: పుదుచ్చేరి, తమిళనాడుల్లో సోమవారం నుంచి 12వ తేది వరకు వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ మేరకు కేంద్రం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రం వైపు వస్తున్న పశ్చిమ గాలుల వేగం వైవిధ్యం కారణంగా ఈ నెల 10వ తేది వరకు రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, 11,12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నెల 6 ఉదయం 8.30 గంటల వరకు గడచిన 24 గంటల్లో అధికంగా శివగంగ, కోడంబాక్కంలో 7 సెం.మీ, ఈరోడ్ జిల్లా నంబియూర్, స్థానిక అన్నా విశ్వవిద్యాలయం, తేనాంపేట, అన్నానగర్, వలసరవాక్కం, తిరువళ్లూర్, రాణిపేట జిల్లా పనబాక్కం తదితర ప్రాంతాల్లో 6 సెం.మీ, స్థానిక డీజీపీ కార్యాలయం, ఎన్నూర్, నుంగంబాక్కం, తిరువొత్తియూర్, ముగలివాక్కం, ఎంజీఆర్ నగర్, చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం, విల్లుపురం జిల్లా అరసూర్, శివగంగ జిల్లా దేవకోట, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాబోయే 48 గంటల్లో రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

ఐదు పైసలు పెరిగిన కోడిగుడ్డు ధర

ఐసిఎఫ్, జూలై 7: నామక్కల్‌లో కోడి గుడ్డు ధర ఫారాల్లో ఐదు పైసలు పెరిగి రూ.5.20 ధరగా నిర్ణయించారు. కోడిగుడ్ల వినియోగం, విక్రమాలు పెరగడంతో 17 రోజుల అనంతరం ధరలు పెంచినట్లు ఫారాల యజమానులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి

ప్యారీస్, జూలై 7: చెంగల్పట్టు సమీపంలోని తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారిలో నాలుగు వాహనాలు వరుసగా ఢీకొనడంతో తల్లీ, కూతురు మృతిచెందారు. స్థానిక తాలంబూర్‌లోని కాసాగ్రాండ్ సుప్రీమ్ అనే అపార్ట్‌మెంట్ కు చెందిన సుదర్శన్ తిరుపతి జిల్లా తడ ప్రాంతంలో విద్యుత్ బోర్డులో ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఆయనకు రంజని(36) అనే భార్య, సాత్విక(18), మనస్విని (6) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో సుదర్శన్ తడ నుంచి తన కుటుంబసభ్యులతో శనివారం ఉదయం తాలంబూర్ వచ్చారు. ఆయన చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపంలో తమ గోశాలను సందర్శించేందుకు కుటుంబసభ్యులతో కలసి కారులో వెళ్లి శనివారం రాత్రి తిరుగుముఖం పట్టారు. వారు చెంగల్పట్టు సమీపంలోని పలవేలి తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారిలో వస్తున్న సమయంలో ముందు వెళుతున్న ఓ కంపెనీ బస్సు రోడ్డు దాటేందుకు ఆగింది. ఆ సమయంలో చెన్నై వైపు వేగంగా వచ్చిన ఆమ్నీ బస్సు ఆగి ఉన్న కంపెనీ బస్సును ఢీకొంది. అలాగే సుదర్శన్ నడుపుతున్న కారు ఆమ్నీ బస్సును ఢీకొంది. అదే సమయంలో వచ్చిన లోడు లారీ ఢీకొనడంతో సుదర్శన్ కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రంజని, మనస్విని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. అదృష్టవశాత్తు సుదర్శన్, పెద్ద కుమార్తె సాత్విక స్వల్పగాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రులు, మృతదేహాలను చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి పరారైన లారీ, ఆమ్నీ బస్సు డ్రైవర్ల కోసం గాలిస్తున్నారు.

రాష్ట్రంలో డెంగ్యూ బాధితులు 4,384 మంది

పెరంబూర్, జూలై 7: రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది డెంగ్యూ జ్వర బాధితులు 4,384 మంది కాగా, పశ్చిమ కొండల సరిహద్దు జిల్లాల్లో ఈ జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. నైరుతి రుతుపవనాల వర్షాలతో 'ఎడిస్-ఎజిప్టై' దోమల వ్యాప్తి అధికమైంది. ముఖ్యంగా పశ్చిమ కనుమల కొండల సరిహద్దు జిల్లాలైన కోయంబత్తూర్, తేని, కన్నియాకుమారి, తెన్‌కాశి జిల్లాల్లో డెంగ్యూ జ్వరం అధికంగా వ్యాప్తి చెందుతోంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4,384 మంది డెంగ్యూ జ్వరం బారిన పడ్డారని, అదే సమయంలో చికెన్ గున్యా, మలేరియా, జికా వైరస్‌ల వ్యాప్తిపై కూడా పర్యవేక్షిస్తున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

రాష్ట్రంలో 31 రోజుల్లో 131 హత్యలు

● సీమాన్

ప్యారీస్, జూలై 7: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించినందువల్ల 31 రోజుల్లో 131 హత్యలు జరిగాయని నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ భౌతికకాయానికి అంజలి ఘటించిన అనంతరం సీమాన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్‌కు భద్రత కల్పించలేని రాష్ట్రప్రభుత్వం ఇక సామాన్యులకు భద్రత ఎలా కల్పిస్తుందని విమర్శించారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో లొంగిపోయిన వారు హంతకులని ఎలా నమ్మాలని, దీనిపై సీబీఐ విచారణ అవసరమని సీమాన్ తెలిపారు.

చోరీచేసిన విగ్రహాన్ని అక్కడే ఉంచిన అగంతకులు


విగ్రహాన్ని అలంకరించి వదిలి వెళ్లిన దృశ్యం

పెరంబూర్, జూలై 7: తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు టౌన్ అవలూరుపేట రోడ్డు సమీపంలో చెరువు గట్టున వినాయకుడి ఆలయం ఉంది. ఈ నేపథ్యం లో, ఆలయంలోని వినాయకుడి విగ్రహాన్ని మూడేళ్ల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన భక్తులు చుట్టుపక్కల ప్రాంతా ల్లో గాలించినా లభించలేదు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం ఆలయంలో వినాయకుడు విగ్రహం ఉండడం చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. అది కూడా విగ్రహాన్ని అలంకరించి ఉంది. మూడేళ్లక్రితం చోరీ చేసిన అగంతకులు మళ్లీ విగ్రహాన్ని అదే ప్రాంతంలో ఉంచి వెళ్లారని భక్తులు భావిస్తున్నారు.

కల్తీసారా వ్యవహారం ....

కల్వరాయన్‌మలై వద్ద మరో నాలుగు చెక్‌పోస్టులు


కొత్తగా ఏర్పాటైన చెక్‌పోస్టులు (అంతర్ చిత్రంలో) వాహన తనిఖీల్లో పోలీసులు

పెరంబూర్, జూలై 7: కల్వరాయన్‌మలై దిగువ ప్రాంతాల్లో మరో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. కళ్లకుర్చిలో కల్తీసారా తాగి 65 మంది మృతిచెందిన ఘటన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కల్తీసారా తయారీ, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక గస్తీ, వాహన తనిఖీలు చేపడుతున్నారు. కల్తీసారా అధికంగా కొండ ప్రాంతాల్లో తయారుచేస్తున్నారని గుర్తించిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లో గస్తీ చేపట్టారు. అందులో భాగంగా కల్వరాయర్ మలై దిగువ ప్రాంతంలోని పన్నిపాడి రోడ్డు, వెల్లిమలై రోడ్డు, మూలక్కాడు, సిరువాచ్చూర్ తదితర ప్రాంతాల్లో కొత్త చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఒక్కో చెక్‌పోస్ట్‌లో నలుగురు చొప్పున 16 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కరెన్సీ

● పోటీపడి ఏరుకున్న స్థానికులు


సీసీ ఫుటేజీలో నమోదైన ప్రజలు నగదు తీసుకెళ్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 7: మదురై జిల్లా ఉసిలంబట్టిలో రోడ్డుపై చిందరవందరగా పడిన రూ.500 నోట్లను ప్రజలు పోటీపడి ఎత్తుకెళ్లారు. తేని రహదారిలోని పరమరత్తుపట్టి ప్రాంతంలో తేని నుంచి మదురైకి వెళుతున్న వాహనం నుంచి రూ.500 నోట్లు రోడ్డుపై పడ్డాయి. సుమారు 100 మీటర్ల మేర రోడ్డుపై నోట్లు చిందరవందరగా పడడాన్ని గుర్తించి అక్కడి ప్రజలు నిర్ఘాంతపోయి, నోట్లను ఎత్తుకెళ్లారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నగదుపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంతో, ఎత్తుకెళ్లిన ప్రజల నుంచి నగదు సేకరించడం సాధ్యమా అనే ప్రశ్న తలెత్తింది. సుమారు రూ.3 లక్షల విలువైన రూ.500 నోట్లు రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తులు విసిరేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

బస్సు ప్రమాదంలో డ్రైవర్ మృతి


● నలుగురికి గాయాలు


రోడ్డు డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైన బస్సు

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సు రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందారు. చెన్నై నుంచి వేదారణ్యం ఆ బస్సు బయలుదేరింది. పచ్చమైకాడు ప్రాంతానికి రాజా (44) డ్రైవర్‌గా ఉన్న ఆ బస్సు ఆదివారం వేకువజాము కడలూరు రెడ్డిచావడి సమీపం కరిక్కన్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద వెళుతుడగా అదుపు తప్పి రోడ్డు డివైడర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మరణించారు. కండక్టర్ కృష్ణమూర్తి, చెన్నై రామాపురానికి చెందిన సౌర్ణం (48), కదిరేశన్ (25), కారైక్కాల్‌కు చెందిన మరియాన్ (85), పాతిమా (4) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలియగానే రెడ్డిచావిడి పోలీసులు హుటాహుటిన అక్కడిక చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పుదుచ్చేరి జిప్‌మర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా రెండు గంటలపాటు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

చిత్రజ్యోతి

'గౌండంపాళెయం' విడుదలకు సీఎం చొరవ చూపాలి : దర్శక నటుడు రంజిత్


మీడియాతో మాట్లాడుతున్న రంజిత్

తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన 'గౌండంపాళెయం' చిత్రం విడుదలకు ముఖ్యమంత్రి స్టాలిన్ చొరవ చూపాలని దర్శక నటుడు రంజిత్ విజ్ఞప్తి చేశారు. ఆయన హీరోగా నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'గౌండంపాళెయం'. ఈ నెల 5వ తేదీ విడుదలకావాల్సి ఉండగా, బెదిరింపుల కారణంగా చిత్రాన్ని విడుదల చేయలేదు. దీనిపై ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్రం విడుదలకు కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలు వ్యతిరేకిస్తూ, థియేటర్ యజమానులను బెదిరిస్తున్నారు. ఈ విషయంపై కోయంబత్తూరు పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. ఈ సినిమా విడుదలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సాఫీగా విడుదల చేసేందుకు చొరవ చూపించాలని ముఖ్యమంత్రి స్టాలిన్, సినిమాటోగ్రఫీ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయనున్నాం. కపట ప్రేమ, తల్లిదండ్రుల మనోవేదన వంటి అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. సినిమాను నిర్మించిన నాతో పాటు మిగిలిన నిర్మాతలంతా రైతులే. ఎవరూ కోటీశ్వరులు కాదు. నేను జన్మించిన నేలలో నా చిత్రం విడుదల చేయలేకపోవడం మనోవేదన కలిగిస్తుంది. నన్ను వ్యతిరేకించే వారికి ఈ చిత్రం విజయం సరైన సమాధానం చెబుతుంది. సెన్సార్ సర్టిఫికెట్ మంజూరు చేసిన తర్వాత కూడా విడుదల చేయలేకపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ సినిమాను త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

'బైసన్' తొలి షెడ్యూల్ పూర్తి

మారి సెల్వరాజ్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ నటిస్తున్న 'బైసన్' మూవీ తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో పశుపతి, కలైయరసన్, రెజిషా విజయన్, హరికృష్ణన్, అళగమ్ పెరుమాళ్, అరువి మదన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నివాస్ కె.ప్రసన్న సంగీతం అందించే ఈ చిత్రానికి ఎళిల్ అరసు సినిమాటోగ్రఫీ సమకూర్చుతున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకం, దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం స్టూడియో సంయుక్తంగా ఈ మూవీ నిర్మిస్తున్నాయి. ఇటీవల ఫస్ట్‌లుక్ విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి ట్రిమండస్ రెస్పాన్స్ వచ్చిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో తొలి షెడ్యూల్ విజయవంతంగా పూర్తి చేసుకుందని దర్శకుడు మారి సెల్వరాజ్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. కాగా, మారి సెల్వరాజ్, వడివేలు, ఉదయనిధి కాంబినేషన్‌లో వచ్చిన 'మామన్నన్' ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఈ చిత్రం ద్వారా మారి సెల్వరాజ్ చేపట్టిన ప్రాజెక్టు కావడంతో 'బైసన్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.


'బైసన్'లో విక్రమ్ ధృవ్

ఒక చిత్రానికి ఐదుగురు సంగీత దర్శకులు !

అధర్వ మురళి, నిమి షా సజయన్ జంటగా నటిస్తున్న 'డీఎన్ఏ' చిత్రానికి ఐదుగురు సంగీత దర్శకులు పనిచేస్తున్నారు. 'ఫర్హానా' ఫేం నెల్సన్ వెంకటేశన్ కథ సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నారు. ఒలింపియా మూవీస్ పతాకంపై ఎస్. అంబేత్ కుమార్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందుతున్న ఈ మూవీ చిత్రీకరణ పనులన్నీ పూర్తి చేసుకుని డబ్బింగ్ కార్యక్రమాలను జరుపుకుంటుంది. సాధారణంగా ఒక చిత్రానికి ఒక సంగీత దర్శకుడు పనిచేస్తుంటారు. కానీ, ఈ సినిమాకు మాత్రం ఏకంగా సత్యప్రకాష్, శ్రీకాంత్ హరిహరన్, ప్రవీణ్ సైవి, సహి శివ, అనల్ ఆకాష్ అనే ఐదుగురు మ్యూజిక్ డైరెక్టర్లు పనిచేయడం గమనార్హం. చిత్రంలోని ఐదు పాటల్లో ఒక్కో పాటకు ఒక్కో సంగీత దర్శకుడు చొప్పున మొత్తం ఐదుగురు సంగీత దర్శకులు సంగీత బాణీలను సమకూర్చారు.



'డీఎన్ఏ' సంగీత దర్శకులు

శాండ్‌విచ్‌లో చిక్కుకున్న ప్రభుదేవా!!

ప్రభుదేవా నటిస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రానికి 'జాలియో జింఖానా' అనే టైటిల్ ఖరారు చేసి, శనివారం ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. శక్తి చిదంబరం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను గత యేడాది సెట్స్‌పైకి తీసుకెళ్ళారు. తాజాగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ప్రభుదేవా శాండ్‌విచ్‌లో చిక్కుకుని ఉండగా, దాన్ని పలువురు నటీమణులు చేతులతో ఎత్తిపట్టుకునివుండేలా డిజైన్ చేశారు. ఇందులో హీరోయిన్‌గా మాడోనా సెబాస్టియన్ నటించగా, ఇతర పాత్రలను అభిరామి, యోగిబాబు, రెడిన్ కింగ్స్లీ, రోబో శంకర్, సాయి దీనా, యాషికా ఆనంద్, మధుసూదన్ తదితరులు పోషించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వెల్లడిస్తూ, 'ప్రభుదేవా నటిస్తున్న పూర్తి హాస్యభరిత చిత్రం. సినిమా ఆద్యంతం హీరో శవంలా నటిస్తారు.తెన్‌కాశికి చెందిన ఒక ఫ్యామిలీ ఈ శవాన్ని కొడైక్కెనాల్‌లో చేర్చాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ శవాన్ని తెన్‌కాశి నుంచి కొడైక్కెనాల్‌కు ఎలా తరలించారన్నది కడుపుబ్బ నవ్వించేలా హాస్యభరితంగా చిత్రీకరించాం' అని పేర్కొన్నారు. నిర్మాణాంతర పనులన్నీ పూర్తి చేసి త్వరలోనే విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని వివరించారు. ట్రాన్స్‌ఇండియా మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం అశ్విన్ వినాయగ మూర్తి.


'జాలియో జింఖానా'లో ఫస్ట్‌లుక్

కంచి వళక్కరుతీశ్వరర్ ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభం


ధ్వజస్తంభానికి హారతి పడుతున్న ఆలయ పూజారి

చెన్నై, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): కాంచీపురం గాంధీ రోడ్డులోని సుప్రసిద్ధ వళక్కరుతీశ్వరర్, పరాశరేశ్వరాలయంలో ఆణి ఉత్తిర తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారు వివిధ వాహన సేవల్లో పాల్గొని నాలుగు రాజవీధులలో ఊరేగనున్నారు. ఈ నెల 11న అధికార నంది సేవ ఉత్సవం, రాత్రి మరువాకుళలి అంబిక సమేతుడై నందివాహనంలో ఊరేనున్నారు. అదే రోజు రాత్రి తిరుకల్యాణ ఉత్సవం జరునుంది. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొననున్నారు. ఈ నెల 13న రథోత్సవం, 16న వృషభ వాహనంలో స్వామివారు ఊరేగి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ నెల 19న తీర్థవారితో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

వ్యవసాయ విశ్వవిద్యాలయంతో బెస్ట్‌కేర్ ఫౌండేషన్ ఒప్పందం


వైద్యనిపుణులను సత్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి అపూర్వ

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వైద్యుల దినోత్సవంలో భాగంగా నగరంలోని స్టార్‌హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికాకు చెందిన బెస్ట్‌కేర్ ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, జీఎస్‌పి గ్లోబల్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో బెస్ట్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ సుదందిరన్, చికాగోకు చెందిన డాక్టర్‌విజయ్ జి.ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సభలో రాష్ట్ర వ్యవసాయ విభాగం ప్రధాన కార్యదర్శి అపూర్వ పాల్గొని డాక్టర్ కృష్ సుదందిరన్, యూకేకు చెందిన సీనియర్ ప్లాస్టిక్ సర్జెన్ డాక్టర్ జయప్రకాష్, మద్రాస్ మెడికల్ కాలేజీ మాజీ డీన్ డాక్టర్ కనకసబై, ప్రస్తుత డీన్ డాక్టర్ అరుళ్‌పిచ్చై నారాయణ్, ప్రైమ్ ఇండియన్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ఆర్ కన్నన్, న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ బీను చెల్లదురై తదితరులు ఘనంగా సత్కరించారు.

ఫ్యాబ్‌లెస్ చిప్ కంపెనీ స్థాపనకు ఐవీపీ సన్నాహాలు


మీడియాతో మాట్లాడుతున్న రాజా మాణిక్యం

అడయార్, జూలై 7: సెమీ కండక్టర్ల తయారీ కంపెనీల్లో ఒకటైన ఐవీపీ దేశంలో ఫ్యాబ్‌లెస్ చిప్ కంపెనీ స్థాపించేందుకు ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు రాజా మాణిక్యం శనివారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తమ ప్రణాళికలో భాగంగా ఐవీపీ సెమీ చెన్నై, బెంగళూరుల్లో చిప్ డిజైన్ కేంద్రాలను నెలకొల్పేందుకు దృష్టిసారించింది. చెన్నైలో చిప్ తయారీ, పరీక్షా కేంద్రాన్ని నెలకొల్పడానికి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. రెండో టెస్ట్ సౌకర్యం దక్షిణ భారతంలోని మరో ప్రధాన నగరంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. చెన్నై సెంటర్ ఈ యేడాది అక్టోబరు నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తుందన్నారు. వచ్చే రెండు మూడేళ్ళలో 70 మిలియన్ డాలర్ల నుంచి వంద మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అర్జించడమే లక్ష్యంగా తమ కంపెనీ ప్రణాళికలుంటాయని ఆయన పేర్కొన్నారు. సెమీ కండక్టర్ ఇంజనీరింగ్‌లో అపారమైన అనుభవం గడించిన రాజా మాణిక్యం ఇటీవల ఐవీపీ కంపెనీ స్థాపించి, తన మిత్రులతో కలిసి నిధులను సమకూర్చుతున్నారు.

28 నుంచి షెరటాన్ గ్రాండ్ రిసార్ట్ వార్షికోత్సవాలు


సీ సాల్ట్ రెస్టారెంట్ ప్రాంతం

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సమీపంలోని షెరటాన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్ అండ్ స్పా ఆరో వార్షికోత్సవాలు ఈ నెల 28 నుంచి అట్టహాసంగా ప్రారంభమవుతున్నాయని ఆ రిసార్ట్ జనరల్ మేనేజర్ సప్తరిషి బిశ్వాస్ తెలిపారు. రిసార్ట్ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 31 వరకు సి సాల్ట్ రెస్టారెంట్, పిన్‌టైల్ లాంజ్, స్పా సర్వీసుల్లో కస్టమర్లకు పలు రాయితీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలను 44 7100 6000 అనే నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

- శివ అధ్యక్షుడు అజంతా శంకరరావు


విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

ప్యారీస్, జూలై 7: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్ (శివ) అధ్యక్షుడు అజంతా సంస్థ అధినేత డా.కనిగెలుపుల శంకరరావు పిలుపునిచ్చారు. శివ నిర్వహణలోని వాసవి విద్యా నిధి పథకం కింద 150 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులకు స్కాలర్‌షిప్, విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం స్థానిక ప్యారీస్‌లోని కార్యాలయంలో ఆదివారం ఉదయం వాసవి మాత పూజతో ప్రారంభమైంది. సభాధ్యక్షుడు అజంతా శంకరరావు మాట్లాడుతూ... 120 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన 'శివ' ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను పలువురు దాతలు, సభ్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవి విద్యా నిధి పథకం కింద ప్రతి ఏటా అందిస్తున్న ఉపకారవేతనంతో వందలాది మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ఒక ఇంట్లో చదువుకున్న మహిళ ఉంటే ఆ ఇల్లు అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల ఆడపిల్లలు ఉన్నతస్థాయికి చేరుకోవాలనే పట్టుదలతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్తీక్ టిఫిన్ సెంటర్ అధినేత డా.జి.రవిచంద్రన్, గౌరవ అతిథిగా బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ అధికారి ఉప్పు జయచంద్రన్, ఆత్మీయ అతిథిగా ఆర్యవైశ్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రవికుమార్, ఎస్కేపీడీ ట్రస్టీ దేసు లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థులకు విద్యా ప్రాముఖ్యత గురించి వివరించారు. వీరిని శివ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, గౌరవ కోశాధికారి పెసల రమేష్, మద్దాల ప్రవీణ్, మన్నారు ఉదయకుమార్, కేకే త్రినాధ్‌కుమార్, ఇమ్మిడి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూర్‌లో భక్తుల రద్దీ


సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పెరంబూర్, జూలై 7: తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. భక్తులు సముద్రతీరం, తీర్థ కొలనులో పుణ్యస్నానాలు చేసి క్యూలైన్లలో వేచి ఉండి స్వామిని దర్శించుకుంటారు. ఆదివారం సెలవు, శుభ ముహూర్తం కావడంతో తిరుచెందూర్ పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయాన్ని తెల్లవారుజామున 4 గంటలకు తెరచి, 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకాలు, కాల పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల వాహనాలతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది.


చెన్నై గిండి గాంధీమండప ప్రాంగణంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రెట్టమలై శీనివాసన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కయల్‌విళి సెల్వరాజ్, తమిళభాషాభివృద్ధి, సమాచారశాఖల కార్యదర్శి ఎల్.సుబ్రమణియన్, పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు.

పల్లాడియంలో షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం


షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభించి మాడల్స్‌తో ఫోజిస్తున్న నటి అక్షరహాసన్

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రీమియం షాపింగ్ మాల్స్‌లో అతి విస్తారమైన పల్లాడియం ఫోనిక్స్ మార్కెట్ సిటీలో లగ్జరీ షాపింగ్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ వేడుకలను ప్రముఖ సినీ నటి అక్షరహాసన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఫోనిక్స్ మార్కెట్‌సిటీ అండ్ పల్లాడియం సెంటర్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఫెస్టివల్‌లో పేరెన్నికగన్న మైఖేల్ కోర్స్, అర్మని ఎక్చేంజ్, కటీస్పేడ్, డ్యూన్ లండన్, లేబిల్ రితుకుమార్, సూపర్‌డ్రై, సెఫోరా, బ్రూక్స్ బ్రదర్స్ తదితర బ్రాండ్లకు చెందిన వస్తువులకు 40 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

కన్నియాకుమారిలో సూర్యోదయం పర్యాటకులతో కిక్కిరిసిన సముద్రతీరం


సూర్యోదయాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

పెరంబూర్, జూలై 7: దేశ దక్షిణ అంచున ఉన్న కన్నియాకుమారికి ప్రతిరోజు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఆదివారం సెల వు రోజు కావడంతో కన్నియాకుమారి పర్యాటకులతో కిటకిటలాడింది. కేరళ సహా పలు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఇక సముద్ర తీరంలో సూర్యోదయ దృశ్యాన్ని వీక్షించేందుకు తెల్లవారుజాము నుంచే త్రివేణి సంగమం ప్రాంతంలో పర్యాటకులు గుమిగూడారు. సూర్యోదయం సమయంలో ప్రత్యేక పూజలు చేసిన పర్యాటకులు, ఆ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు. అనంతరం పర్యాటకులు వివేకానంద రాక్‌కు వెళ్లేందుకు బోట్ హౌస్‌కు చేరుకున్నారు. ఉదయం 8 గంటలకు పడవలు బయల్దేరాల్సి ఉండగా, అలల ఉధృతి అధికంగా ఉండడంతో పడవలను నడపలేదు. 10.30 గంటల తరువాత అలలు సహజ స్థితికి రావడంతో, రెండున్నర గంటల ఆలస్యంగా పడవలు వివేకానంద రాక్‌కు పర్యాటకులతో బయల్దేరి వెళ్లాయి.

వైభవంగా వైకుంఠవాసుడి ఆలయ మహాకుంభాభిషేకం


శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ పెరుమాళ్‌కు ప్రత్యేక అలంకరణ

ప్యారీస్, జూలై 7: తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వాస పెరుమాళ్ ఆలయ జీర్ణోద్ధరణ, అష్టబంధన మహాకుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ చేపట్టి శ్రీరాముడు, గరుడాల్వార్, ధ్వజస్తంభం, వినాయకుడు, నవగ్రహాలు, విమాన గోపురాలను అద్భుత శిల్ప కళానైపుణ్యంతో నిర్మించారు. అత్తిపట్టు గ్రామ ప్రజలు, లార్డ్ శివ, లార్డ్ విష్ణు భక్తజన సభ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో 25 మంది భట్టాచార్యులు త్రికాల హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల మధ్య సింహ లగ్నంలో వైకుంఠవాస పెరుమాళ్‌కు, విమాన గోపురాలకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు బయ్యా బాలాజీ, ఎండీజీ కార్తీక్‌వేలు, డి.భాస్కర్ రెడ్డి, కె.సుబ్రమణ్యం, ఎండీజీ వడివేలు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు తీర్థ, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

పొమ్మిట్టిలో ఆకట్టుకుంటున్న బెలూన్ థియేటర్

- వివాహాలు, పుట్టిన రోజు వేడుకలకు ప్రత్యేకం



థియేటర్ ప్రవేశ ద్వారం - లోపల ఏర్పాటు చేసిన సీటింగ్

పెరంబూర్, జూలై 7: ధర్మపురి జిల్లా పొమ్మిట్టిలో రాష్ట్రంలోనే మొట్టమొదటి బెలూన్ థియేటర్ ఏర్పాటైంది. బొమ్మిట్టి ప్రాంతానికి చెందిన ఆక్యుపంక్చర్ వైద్యుడు రమేష్ చెన్నైలో సినీరంగంలో పనిచేస్తున్నారు. ఆయన మోడ్రన్ థియేటర్ నిర్మించాలనే ఉద్ధేశంతో ముంబై వెళ్లగా భారీ బెలూన్ల మధ్య ఉన్న థియేటర్‌ను చూశారు. అలాంటి థియేటర్‌ను తన స్వగ్రామంలో నిర్మించాలని ఆయన నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఢిల్లీకి చెందిన 'పిక్చర్ టైమ్' సంస్థతో కలసి, పొమ్మిట్టి బస్టాండ్ ముందు భారీ బెలూన్ల లోపల ఏసీతో కూడిన థియేటర్ ఏర్పాటుచేశారు. ఈ థియేటర్ ఎలాంటి నిర్మాణాలు లేకుండా కేవలం బెలూన్లతోనే రూపుదిద్దుకుంది. ఈ విషయమై రమేష్ మాట్లాడుతూ... 140 సీట్లతో కూడిన ఈ థియేటర్ డిజిటల్ సౌండ్ సిస్టమ్‌తో ఏర్పాటు చేసామన్నారు. ప్రస్తుతం సాధారణ ఛార్జీలు మాత్రమే వసూలుచేస్తున్నామని, వివాహాలు, జన్మదినాలు, ఇంటి వేడుకలు ఈ థియేటర్‌లో నిర్వహించుకోవచ్చన్నారు. అందుకోసం స్క్రీన్ ముందు స్టేజీ కూడా ఉందన్నారు. వేడుకలు జరుపుకుంటూ తమకిష్టమైన సినిమా చూసుకోవచ్చని తెలిపారు. బెలూన్లతో చేసినందున పగిలి పోతుందనిగాని, గాలి వస్తే ఇబ్బందులు పడతామని భయం వద్దని, అలాంటి వాటిని తట్టుకొనేలా అన్ని జాగ్రత్తలతో థియేటర్ రూపొందించామన్నారు. ఈ థియేటర్ మరో ప్రాంతానికి మార్చాలంటే కేవలం మూడు గంటలు మాత్రమే పడుతుందన్నారు. టిక్కెట్ కౌంటర్, క్యాంటీన్, ప్రొజెక్టర్ రూమ్ తదితరాలు కూడా థియేటర్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ బెలూన్ థియేటర్ నిర్మాణానికి ఖర్చు కూడా తక్కువేనన్నారు. పలు జిల్లాల నుంచి వస్తున్న వారు థియేటర్ ఏర్పాటు గురించి వివరాలు సేకరించి వెళుతున్నారని తెలిపారు. పోచంపల్లి, నల్లంపల్లి తదితర ప్రాంతాల్లోనూ బెలూన్ థియేటర్లు ఏర్పాటుచేయనున్నామన్నారు. ఈ థియేటర్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని రమేష్ తెలిపారు.